



సూదికొండకాలనీలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

# గొంతెండుతోంది!




పురుషోత్తపురంలో ట్యాంకర్ వద్ద మహిళల పాట్లు



**మునిసిపాలిటీల్లో ఎక్కడ చూసినా తాగునీటి ఇబ్బందులే. 'తాగునీటి సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం. ప్రతి ఇంటికీ నీరందిస్తామ'న్న అధికారపార్టీ నేతల ప్రకటనలు.. ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతో.. తాగునీటి పథకాల నిర్వహణ గాలికొదిలేశారు. కనీసం పైపులైన్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో ప్రస్తుత వేసవి వేళ.. మరింతగా తాగునీటి కష్టాలు పడుతున్నామని మహిళలు ఆవేదన చెందుతున్నారు. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు రావడం లేదని.. ట్యాంకర్ల ద్వారా మూడు రోజులకోసారి అరకొరగా నీటి సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు.**

- తాగునీటి కష్టాలు తీరేదెన్నడో?
- మునిసిపాలిటీల్లో అరకొరగా నీటి సరఫరా
- నిధులు మంజూరులో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- మహిళలకు తప్పని ఇబ్బందులు

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో 23 వార్డులు ఉన్నాయి. 1, 2, 3, 18, 19, 20 వార్డులతో పాటు పలు వీధుల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. 15 ఏళ్ల కిందట మునిసిపాల్టీలో 28వేల జనాభాకు అనుగుణంగా నీటి పథకానికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 36వేలకు జనాభా పెరగ్గా.. అదేస్థాయి నీటి వాడకం కూడా అధికమైంది. బాహుదానదిలోని ఊటబావుల నుంచి పంపుహౌస్‌కి నీటి సరఫరా చేసి.. క్లోరినేషన్ చేపట్టి.. ఇచ్ఛాపురం రాజావారితోటలోని 8 లక్షల లీటర్ల రిజర్వాయర్ ద్వారా మునిసిపాలిటీ ప్రజలకు నీటిని అందిస్తున్నారు. పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు(1,2,3 వార్డులు) కుళాయిల ద్వారా నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు నాణ్యతాలోపం కారణంగా లీకులు కావడంతో ట్రైల్‌లోనే వదిలేశారు. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వినియోగంలో లేకుండా పోయింది. ఈ మూడు వార్డుల పరిధిలో 8 చింతటెక్ ట్యాంకర్లు ఏర్పాటు చేయగా.. నెలరోజులకే మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు వార్డులకు మూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, రోజూ నీటిని సరఫరా చేయాలని అధికారులను అడుగుతున్నా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా కనీసస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో తాగునీటి పథకం నిర్వహణ పనులు సక్రమంగా సాగడం లేదని వాపోతున్నారు.

### ● రోజు విడిచి రోజు కుళాయి

అధికారపార్టీ నేతలు, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు.. అదీ గంటపాటు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఉన్న బెల్లుపడ గ్రామంలో సుమారుగా ఏడు వీధులకు పూర్తిగా కొలాయిలు ద్వారా నీరు రావడం లేదు. దీంతో దూరప్రాంతంలో ఉన్న బావుల నుంచి నీటిని తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. 18, 19, 20 వార్డుల ప్రజలు కూడా తాగునీటి ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

### ● పట్టించుకోవడం లేదు..



అధికారపార్టీ నేతలు పురుషోత్తపురంలోని 1, 2 వార్డుల్లో నీటి సమస్యపై పట్టించుకోవడం లేదు. మూడు రోజులకోసారి ట్యాంకర్లతో సరఫరా చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. చెరువు, బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై నిర్మించిన ట్యాంక్ శిథిలావస్థకు చేరుకున్నా.. ఇంతవరకూ పైపులైన్లు లేవు.

**-గాలి ధనవతి, 2వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్**

### చర్యలు తీసుకుంటున్నాం..



ఇచ్ఛాపురంలో 1, 2, 3 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా ఒక్కో వీధిలో నీటిని సరఫరా చేస్తున్నాం. మునిసిపాలిటీలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

**- ఎన్.రమేష్, మునిసిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం**

### ● నిత్యం తాగునీటి సమస్యే..



ఇచ్ఛాపురంలోని ఏఎస్‌పేటలో నిత్యం తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారపార్టీ నేతలు కుళాయిల ద్వారా నీరందిస్తామని చెప్పి.. నాసిరకం పైపులు వేయడంతో అవి ప్రారంభించకముందే లీకులు ఏర్పడ్డాయి. రోజూ ట్యాంకర్లతో నీటిని అందిస్తామని చెప్పిన అధికారులు.. మూడు రోజులకోసారి అరకొరగా సరఫరా చేస్తున్నారు.

**-తవిటయ్య, 3వ వార్డు టీడీపీ కౌన్సిలర్, ఇచ్ఛాపురం**

## సూదికొండకాలనీకి ట్యాంకర్ల నీరే గతి

(పలాస)

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 19వ వార్డు సూదికొండకాలనీలో తాగునీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో శాశ్వత మంచినీటి పథకాలు లేవు. పవర్‌బోర్లలో నీరు అడుగంటింది. కుళాయిల ద్వారా వారానికోసారి.. కొద్దిపాటి నీరు మాత్రమే సరఫరా అవుతోంది. కొండ ప్రాంతం కావడంతో నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రోజూ మునిసిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వాటిని డ్రమ్ముల్లో నింపి.. కొండపై ఉన్న తమ గృహాలకు మహిళలు తీసుకెళ్తున్నారు. సూదికొండ కాలనీలో మొత్తం 3వేల జనాభా ఉన్నారు. ఎక్కువగా జీడి, ఆటోరిక్షా కార్మికులతో పాటు సాధారణ ప్రజలే నివసిస్తున్నారు. మున్సిపాలిటిలో దీర్ఘకాలిక తాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో ప్రతిరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోర్లు వేసినా 600 అడుగులు లోతు వెళ్లనిదే నీరు పడని పరిస్థితి ఉంది. 25 ఏళ్ల కిందట ఏర్పడిన ఈ కాలనీకి ఇప్పటివరకూ నీటి సమస్య తీర్చే నాథులే లేరు. ప్రతి ఎన్నికల్లో శాశ్వత తాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని చెబుతున్న ప్రజాప్రతినిధులు తరువాత ముఖం చాటేస్తున్నారు. సూదికొండ నీటి పరిష్కారం కోసం రోటరీక్లబ్ గతంలో భారీ ట్యాంకు నిర్మించింది. నీరు లభ్యత అంతంతమాత్రం కావడంతో ఆ ప్రాజెక్టు ప్రస్తుతం రూపం లేకుండా పోయింది. వీధిలో అక్కడక్కడా పవర్‌బోర్లు వేసినా నీరందడం లేదని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

### శాశ్వత పరిష్కారం చూపించాలి..



మాకు శాశ్వత మంచినీటి పరిష్కారం చూపించాలి. బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరే గతవుతోంది. మేము పనులకు వెళ్లిపోతే నీరు పట్టడా నికి కూడా ఎవరూ ఉండరు. మండుటెండలో నీరు పట్టుకొని నిల్వ చేసుకుంటున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలి.

**-ఎన్.యశోద, సూదికొండకాలనీ, పలాస**

## ఆమదాలవలసలోనూ.. దాహం కేకలు

(ఆమదాలవలస)

ఆమదాలవలస మునిసిపాలిటీలో 23 వార్డుల్లో శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఒకటో వార్డు పరిధిలోని తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశంపేట, నాలుగో వార్డులోని గేదెలవానిపేట, కనింవలస ఐదోవార్డులోని రెడ్డిపేట, సొట్టవానిపేట, పంతులపేట ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆరో వార్డులోని నందిగిరిపేట, తురకపేట, పంతులుపేట, తెలగ మన్నయ్యపేట, కాళింగ మన్నయ్యపేట, ఏడోవార్డులోని చింతాడ, చింతాడ కాలనీ, 21వ వార్డులోని కుద్దిరాం తదితర ప్రాంతాల్లో నేటికీ మంచినీటి కుళాయిలు లేవు. అధికారులు ట్యాంకర్లతో అరకొరగా మూడురోజులకోసారి నీటిని సరఫరా చేస్తుండడంతో అవస్థలు తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు.




ఆమదాలవలసలో తాగునీటి కోసం మహిళల అవస్థలు

● ఆమదాలవలస మునిసిపాలిటీలో సుమారు 40వేలకుపైగా జనాభా ఉన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పట్టణ ప్రణాళిక విభాగం ప్రతిపాదనలు పంపుతున్నా.. ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేస్తోంది. దీంతో నీటి పథకాల పనులు సక్రమంగా సాగడం లేదు. టీడీపీ హయాంలో పట్టణ శివారు వార్డులకు తాగునీరందించేందుకు 2018లో రూ.40కోట్లు మంజూరు కాగా.. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. గత ప్రభుత్వ పథకాలను నిలిపేయడంతో తాగునీటి పైపులు వృథాగా పడి ఉన్నాయి. శివారు వార్డు ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఇటు వంశధారనది నుంచి వచ్చిన నీరు మెట్టక్కివలస, కృష్ణాపురం, మార్కెట్, గేటు, వెంగళరావుకాలనీ వంటి ప్రాంతాలకు సరఫరా అవుతోంది. అటు నాగావళి నది నుంచి వచ్చిన నీరు లక్ష్ముడుపేట, వెంకయ్యపేట, బొడ్డేపల్లిపేట వంటి వార్డులకు సరఫరా అవుతోంది. ఈ రెండు నదుల వద్ద ఉన్న పంపుసెట్ల మోటార్ల సామర్థ్యం చాలడం లేదు. ఒక్కోసారి మోటార్లు మొరాయిస్తే ఒకటి రెండు రోజులు వార్డులకు తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. దీనికితోడు పట్టణంలో సగానికిపైగా బడాబాబులు కుళాయిలకు మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. మరోవైపు ఎక్కడికక్కడ పైపులైన్ల లీకేజీ కారణంగా పట్టణ ప్రజలకు సక్రమంగా నీరందడం లేదు.

● మునిసిపాలిటీ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు టీడీపీ హయాంలో.. అప్పటి విప్ కూన రవికుమార్ రూ.33కోట్లతో పనుల నిర్వహణకు చర్యలు చేపట్టారు. ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అలాగే 2020లో స్పీకర్ తమ్మినేని సీతారాం.. ఏఐఐబి నిధులు రూ.61.38కోట్ల వ్యయంతో పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ఆదిలోనే నిలిచిపోవడంతో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి.



ఆమదాలవలస మునిసిపాలిటీలో వృథాగా తాగునీటి పైపులు

## ఈవీఎంల రెండోదశ ర్యాండమైజేషన్ పూర్తి

● జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్

**కలెక్టరేట్, మే 1:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంటుతో పాటు, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు శేఖర్ విద్యార్థి మాట్లాడుతూ మొదటి దశలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా, రెండవ దశలో పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలు కేటాయిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల సమక్షంలో, ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానం ద్వారా, పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, శ్రీకాకుళం, నరసన్నపట ఆర్వోలు సీహెచ్ రంగయ్య, రామ్మోహన్, ఈవీఎంల నిర్వహణ నోడల్ అధికారి సుధ, ఎస్ఎస్ఏ జయప్రకాష్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి, పక్కన కలెక్టర్

## నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

● ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

**కలెక్టరేట్, మే 1:** ఎన్నికల నిబంధన ఉల్లంఘనకు సంబంధించి శ్రీకాకుళం పార్లమెంటుతో పాటు శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ప్రజలు నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి తెలిపారు. జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. శ్రీకాకుళం అరసవల్లి రోడ్డులోని సన్‌రైజ్ హోటల్లో ప్రతీరోజు ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు అందుబాటులో ఉంటానని, తనను నేరుగా కానీ, లేదా 9032923131 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని సూచించారు. ఎన్నికల నిర్వహణలో లోటుపాట్లపై సలహాలు, సూచనలు కూడా చేయవచ్చని తెలిపారు.

## మంత్రి స్వగ్రామంలో వైసీపీ దౌర్జన్యం

● టీడీపీ ప్రచారాన్ని అడ్డుకునేందుకు యత్నం
● తిప్పికొట్టిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

**వజ్రపుకొత్తూరు, మే 1:** మంత్రి సీదిరి అప్పలరాజు స్వగ్రామం.. దేవునల్తాడలో టీడీపీ నేతల ఎన్నికల ప్రచారాన్ని వైసీపీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. స్థానిక టీడీపీ, జనసేన కార్యకర్తలు వారి ప్రయత్నాలను తిప్పికొట్టడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చేసుకుంది. గ్రామ పెద్దల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో బుధవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పలాస టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శివాలయం, పెద్దతల్లి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ప్రచార రథంపై వివిధ కూడళ్లలో ప్రసంగించారు. చివరకు బస్టాండ్ వద్దకు ప్రచారరథం చేరుకోగా.. వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని.. ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్ద పెద్దగా కేకలు వేస్తూ.. ప్రచార ర్యాలీ మధ్యలోకి చొరబడ్డారు. దీనిని గమనించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు తాము ఎన్నికల ప్రచారానికి వచ్చామని, గొడవలకు రాలేదన్నారు. మీ పార్టీ నాయకులు కూడా ఎక్కడైనా ప్రచారం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అయినా వైసీపీ శ్రేణులు తగ్గకపోవడంతో.. స్థానిక టీడీపీ, జనసేన కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ప్రచారాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్న వైసీపీ శ్రేణులు



ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరగ్గా.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామ పెద్దలు కలుగజేసుకుని వర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. కాగా.. అంతకు ముందు ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సొంత గ్రామానికి వంశధార నీరందించకుండా మంత్రి అప్పలరాజు కుంటిసాకులు చెబుతున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, శోభారాణి, గొరకల వసంతరావు, జనసేన నాయకులు విదుర్గారావు, కణితి సురేష్, బుల్లోజు శశిభూషణ్, ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం పోరాడుదాం

● ఘనంగా మేడే



కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని.. జిల్లాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా వివిధ పరిశ్రమల వద్ద కార్మికులు జెండాలు ఎగుర వేసి.. కార్మిక పోరాటాల్లో అమరులైన వారికి నివాళి అర్పించారు. రణ స్థలం మండలం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మనాయుడు, పి. తేజేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ చేశారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమని.. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

**- రణస్థలం**

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**రణస్థలం, మే 1:** ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కుప్పిలి, బుడగట్లపాలెం, కొచ్చెర్ల తదిర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. ఈ నెల 13న ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కుప్పిలిలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక



ఆంధ్రజ్యోతి శ్రీకాకుళం జిల్లా వార్తలు జన కేతనం
గురువారం 2 మే 2024



సీనియర్ ఓటరు

## అప్పటి రాజకీయాల్లో విలువలు ఉండేవి



నరసన్నపేట: నాకు అరవై దశకంలో ఓటుహక్కు వచ్చింది. అప్పట్లో 21 సంవత్సరాలు నిండిన తర్వాత ఓటు హక్కు కల్పించేవారు. ఆనాటి రాజకీయాల్లో విలువలు ఉండేవి. ఓట్లకోసం నాయకులు ఇంటింటికి కాలినడకన వచ్చేవారు. బరిలో ఉన్న అభ్యర్థులు ఒకరి తరువాత ఒకరు వచ్చేవారు. పోటీదారులు మధ్య స్నేహపూర్వ వాతావరణం ఉండేది. నాయకులు ప్రజలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. రాజకీయల్లో అవినీతి ఎక్కు వైంది. ఓటర్లు కూడా డబ్బులు తీసుకుంటున్నారు. నాయకులు కూడా ఆ విధంగా తయారయ్యారు. అక్షరాస్యత పెరిగింది.. అలాగే అవినీతి కూడా రాజకీయాల్లో పెరిగింది. ఎన్నికల డ్యూటీలకు సరదాగా వెళ్లేవాళ్లం. ప్రస్తుతం ఎన్నికల డ్యూటీ చేయాలంటే ఉద్యోగులు భయపడు తున్నారు.

**-కింతలి వెంకట సత్యనారాయణ, రిటైర్డు డిగ్రీకళాశాల అధ్యాపకులు, నరసన్నపేట**

కళింగపట్నం (కె.మత్స్యలేశం) బీచ్‌ను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. బీచ్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని గతంలో మాటిచ్చి మరిచింది. ఐదేళ్ల కిందట వచ్చిన వరదలకు బీచ్ తీరం కోతకు గురైంది. తీరంలోని బొమ్మలు, సిమెంట్ బల్లలు, ఇతర పర్యాటక సామగ్రి అంతా సముద్రంలో కలసిపోయింది. సందర్శకులు రావడం మానేశారు. బీచ్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని, అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి ధర్మాన హామీఇచ్చారు. ఐదేళ్లు గడిచినా ఈ పనులు ముందుకు సాగలేదు. నిధులు రాక, బిల్లులు కాక పనులు ఆగిపోయాయి. పర్యాటకాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు.

-గార



వెలవెలబోతున్న కళింగపట్నం బీచ్

- కళింగపట్నం బీచ్‌ను మరిచారా?
- పూర్వవైభవం తీసుకొస్తామన్నారు కదా?
- ఎందుకు పనులు చేపట్టడం లేదు?
- కళా విహీనంగా పర్యాటక కేంద్రం
- అభివృద్ధి చేస్తామని గతంలో మాటిచ్చిన మంత్రి ధర్మాన
- నిధులు రాక.. బిల్లులు కాక ముందుకు సాగని పనులు
- వైసీపీ ప్రభుత్వంపై పర్యాటకుల ఆగ్రహం

# ఇది ధర్మమేనా?

జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో కె.మత్స్యలేశం (కళింగపట్నం) బీచ్ ఒకటి. గతంలో ఇక్కడకు శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల, పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి నిత్యం సందర్శకులు వచ్చేవారు. పిక్నిక్‌ల సమయంలోనే కాకుండా శని, ఆదివారాల్లో వందలాది మంది సందర్శకులతో ఈ ప్రాంతం కళకళలాడేది. పర్యాటకుల కోసం అన్ని రకాల వసతులు కల్పించేందుకు గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. రూ.50లక్షలు ఖర్చుచేసి బుద్ధుడు, ఏనుగు, జిరాఫీ మొదలైన బొమ్మలతో పాటు సందర్శకులు కూర్చొనేందుకు గ్రానైట్‌తో కూడిన బల్లలు ఏర్పాటు చేశారు. 2019 ఆగస్టులో వంశధార నదికి భారీగా వరదలు వచ్చాయి. వరద ఉధృతికి నదీ ప్రవాహం దిశ మారడంతో అప్పట్లో గ్రామస్థులు ఆ రోజు అర్ధరాత్రి బిక్కుబిక్కుమని గడిపారు. వరద నేరుగా సముద్రం వైపు వెళ్లకుండా బీచ్ వైపునకు దూసుకురావడంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన బొమ్మలు, పరికరాలు, కట్టడాలు సముద్రంలోకి కొట్టుకుపోయాయి. బీచ్ ఫ్రంట్ రోడ్డు కూడా కొట్టుకుపోయింది. దీంతో బీచ్ కళావిహీనంగా మారింది. అప్పటి నుంచి ఇక్కడకు క్రమేణా సందర్శకులు రావడం తగ్గింది. అయితే, బీచ్ కోతకు గురైనా చాలామంది సముద్రంలో స్నానాలు చేయడానికి వచ్చి ప్రమాదాల బారినపడేవారు. దీంతో అధికారులు రోడ్డుకు అడ్డంగా సిమెంట్ గోడ కట్టించారు. దీంతో పూర్తిగా సందర్శకుల రాకపోకలు తగ్గిపోయాయి. వైసీపీ ప్రభుత్వం బీచ్ పునరుద్ధరణ, మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంతం ప్రస్తుతం వెలవెలబోతుంది. కాగా, గతంలో బీచ్‌కు సందర్శకులు వచ్చే సమయంలో పరిసర గ్రామాల్లోని చిరువ్యాపారులకు ఉపాధి దొరికేది. ప్రస్తుతం సందర్శకులు రాకపోవడంతో వారంతా కూలీలుగా మారిపోయారు.

### పూర్వ వైభవం కలేనా?

కళింగపట్నం బీచ్ కోతకు గురైన తర్వాత ఆ గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. మళ్లీ వరద వస్తే గ్రామంలోకి చొచ్చుకు వస్తుందని, సముద్రంలో గ్రామం కలిసి పోతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి గ్రామస్థులు తీసుకువెళ్లారు. తక్షణమే బీచ్‌ను పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనేపథ్యంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు బీచ్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.7.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో బీచ్‌లో డ్రెడ్జింగ్ చేపట్టి పనులు ప్రారంభించారు. మొదట్లో పనులు వేగంగా జరిగినా తరువాత నిధులు కొరత, బిల్లులు కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఈ బీచ్ పరిస్థితిని చూసి సందర్శకులు ఆవేదన చెందుతున్నారు. బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు వైసీపీ ప్రభుత్వానికి ఐదేళ్ల సరిపోలేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కానరాని బీచ్ ఫెస్టివల్

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిరోజూ వందలాది మంది సందర్శకులతో కళింగ పట్నం బీచ్ కళకళలాడేది. 2016 నుంచి 2019 వరకు ప్రతిఏటా ఇక్కడ మూడు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్‌ను వైభవంగా నిర్వహించేవారు. బుల్లితెర నటులతోపాటు వివిధ రంగాల కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. జిల్లా నలు మూలల నుంచి వేలాదిమంది కుటుంబాలతో తరలివచ్చే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీచ్ ఫెస్టివల్ నిర్వహణను నిలిపివేశారు.

### పూర్వ వైభవం తీసుకురావాలి..



జిల్లాలో మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన కె.మత్స్యలేశం బీచ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎంతో చారిత్రక, ప్రసిద్ధి చెందిన ఈ బీచ్‌లో సందర్శకులకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

**-జేసీ దేవదాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు**



సముద్రంలోకి కొట్టుకుపోతున్న ఏనుగు బొమ్మ



కోతకు గురైన తీరం

అవునా

## ఆ ఓటును కవరులో భద్రపరుస్తారు

గార: ఎన్నికల సమయంలో ఎక్కువగా వినిపించే పదం టెండర్ ఓటు. దీనినే చాలెంజ్ ఓటు అని కూడా అంటారు. అర్హుడైన వ్యక్తి ఓటును ఇతరులు వేయడం, దొంగ ఓటు లేక ఇతర కారణాలతో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఎదురైతే తిరిగి దానిని పొందేందుకు ఎన్నికల సంఘం 1961లో సెక్షన్ 49 (పి)ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించింది. ఈ విధానంలో ఓటు ఓటు పొందాలనుకునే వారు ముందుగా ఎన్నికల అధికారిని కలిసి ఓటు కోల్పోయిన వ్యక్తి తానేనని నిరూపించుకోవాలి. దీనికోసం ఓటరు కార్డు, ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. ఎన్ఆర్ఐలు అయితే పాస్‌పోర్టు చూపించాలి. ఎన్నికల అధికారి ఇచ్చే ఫారం 17(బి) పూర్తిచేసి టెండర్ బ్యాలెట్ పొందాలి. ప్రత్యేక కవరులో ఈ ఓటును భద్రపరచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. సెక్షన్ 49(పి) ద్వారా పొందే ఓటు హక్కును టెండర్/చాలెంజ్ ఓటు అంటారు.



పోటీ చేయడమంటే..

## ఆయనకు సరదా



గుడివాడ కుప్పయ్య (ఫైల్)

రణస్థలం: ఎచ్చెర్ల మండలం కుప్పిలికి చెందిన గుడివాడ కుప్పయ్యకు గెలుపోటములతో సంబంధం ఉండేది కాదు. ఆర్థిక భారమైనా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడం ఆయనకో సరదా. తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రతి ఎన్నికలో పోటీ చేసేందుకు ముందుకొచ్చేవాడు. 2009, 2014 ఎన్నికల్లో ఎచ్చెర్ల అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి నామినేషన్ వేశాడు. గతఎన్నికలో (2019)లో పోటీచేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే తాను నమ్ముకున్న బీఎస్పీ జనసేనకు మద్దతు ఇవ్వడంతో ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయకుండా ఆ పార్టీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించాడు. కొన్నాళ్ల చిలకపాలెంలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అయితే కోవిడ్‌తో మూడేళ్ల కిందట ఆయన మృతి చెందాడు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన కనిపించకపోవడంతో అంతా చర్చించుకుంటున్నారు. అలాగే లావేరు మండలానికి చెందిన గుడివాడ అప్పారావు కూడా 1999 ఎన్నికల వరకూ మూడు నాలుగు సార్లు ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేశారు.



ఎన్నికల సిబ్బందికి

## ఎంత రెమ్యునరేషన్ ఇస్తారంటే..

(నరసన్నపేట)

ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి గత ఎన్నికలకు చెల్లించిన రెమ్యునరేషనే కొనసాగించనున్నారు. 2019 సాధారణ ఎన్నికల సమయంలో చెల్లించిన రెమ్యునరేషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధులకు సెక్టార్ ఆఫీసరు కాకుండా అదనంగా నియమితులయ్యే జోనల్ మేజిస్ట్రేట్‌కు ఏకమొత్తంగా రూ.1500 చెల్లిసారు.



- ప్రిసైడింగ్ ఆఫీసర్ అండ్ కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350 చెల్లించనున్నారు.
- నాలుగో తరగతి ఉద్యోగులకు రోజుకు రూ.200, వీడియా సర్వేలైన్స్ టీమ్‌కు రూ.1200, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్‌కు రూ.1000 చెల్లిస్తారు.
- కంట్రోల్ రూమ్, కాల్‌సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి రోజుకు రూ.200.
- సెక్టోరల్ ఆఫీసర్‌కు రూ.5000, మాస్టర్ ట్రైనర్‌కు రూ.2000, అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్‌కు రూ.7,500 చెల్లిస్తారు.
- పోలింగ్ రోజున విధులకు నియమితులయ్యే పోలీసు సిబ్బందికి, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోం గార్డులకు, ఫారెస్టు గార్డులకు, గ్రామ రక్షక దళం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్యాక్డ్ లంచ్ లేదా రూ.150 నగదు చెల్లిస్తారు. ఎన్నికల్లో పోలింగ్ విధులకు, ఓట్ల లెక్కింపు విధులకు నియమితులైన వారికి రెమ్యునరేషన్‌తో పాటు లంచ్‌కు రూ.150 చెల్లిస్తారు. అర్హత మేరకు డీఏ చెల్లిస్తారు.

### ఉద్యోగులు పెదవి విరుపు..

ఎన్నికల కమిషన్ ప్రకటించిన రెమ్యునరేషన్‌పై ఉద్యోగులు పెదవి విరిస్తున్నారు. ఎంతో కష్ట తరమైన పోలింగ్ విధులకు నియమితులైన ఉద్యోగులకు నామమాత్రంగా రెమ్యునరేషన్ చెల్లింపునకు ఉత్తర్వులు జారీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కంచిలిలో పని చేస్తున్న వారికి సుమారు 150 కిలోమీటర్ల దూరంగా ఉన్న ఎచ్చెర్ల, ఆమదా లవలస, శ్రీకాకు ళం నియోజవర్గాలకు కేటాయించారు. అంత దూరం వెళ్లి విధులు నిర్వహించి రావాలంటే కనీసం వెయ్యి రూపాయిలు ఖర్చు వుతుంది. ఎంఈవోలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎన్నికల సిబ్బంది రెమ్యూనరేషన్ విషయంలో ఈసీ పునరాలోచించి రెమ్యూనరేషన్ పెంచుతూ తాజా ఉత్తర్వులు సవరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## నిరక్షరాస్యులకు ఓటుహక్కు ఉండేది కాదు

మీకు తెలుసా?

హిరమండలం: రాజ్యాంగం 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు పొందే అవకాశం కల్పించింది. కుల, మత, వర్గ, లింగ, ధనిక, పేద, ప్రాంతాల కతీతంగా అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. బ్రిటిష్ పాలనా కాలంలో కేవలం ప్రభుత్వోద్యోగులు, చదవడం, రాయడం వచ్చినవారు, భూస్వాములు, బ్రిటిష్ ఏలుబడిలో పనిచేసే సిబ్బందికి మాత్రమే ఓటుహక్కును కల్పించే వారు. ప్రధానంగా నిరక్షరాస్యులకు అసలు ఓటుహక్కు ఉండేది కాదు. దేశంలో 1952లో జరిగిన మొదటిసారి సాధారణ ఎన్నికల నుంచి అర్హులందరికీ ఓటుహక్కు కల్పించారు. 1952, 1957ల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రత్యేకంగా పోలింగ్ పెట్టెలను ఏర్పాటు చేసేవారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఈ డబ్బాలో ఓటు వేసే వారు. అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంతమంది ఉన్నా ఒకే డబ్బాను కేటాయించి అందులో ఓటు వేసే విధానం అమల్లోకి తీసుకువచ్చారు.1962 నుంచి ప్రతి పోలింగ్ కేంద్రంలో అందరు అభ్యర్థులకు కలిపి ఒకే డబ్బాను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పత్రాలతో ఓటువేసే విధానం నుంచి నేడు ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలను వినియోగించే వరకూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు.



## అభ్యర్థులూ.. ఆరోగ్యం పదిలం

- ప్రచారంలో జాగ్రత్తలు తప్పనిసరి

(హరిపురం)



వేసవి ప్రారంభం నుంచీ ఈ ఏడాది భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తి పోతున్నారు. ప్రతిరోజూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనాలు భయపడుతున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోంది. దీంతో పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచార పర్వంలో మునిగి తేలుతున్నారు. అయితే, వారిని ఎండలు ఆందోళనకు గురిచేసున్నాయి. ఉదయం పది గంటలు దాటితే ఎండలు మండిపోతుండడంతో ప్రచారానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు జా గ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.




- ఉదయం అభ్యర్థులు, మద్దతుదారులు అల్పాహారం తీసుకొని ప్రచారానికి వెళ్లాలి. ఖాళీ కడుపుతో ప్రచారంలో పాల్గొనరాదు. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటలు, సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రచారం చేయాలి. వీలైనంతవరకు ఎండలో తిరగరాదు.
- వాతావరణం చల్లగ ఉన్న సమయంలోనే ఇంటింటా ప్రచారం చేయాలి. ఎండలో ప్రచారం చేయడం తప్పనిసరైతే గొడుగులు వెంట తీసుకెళ్లాలి. అభ్యర్థులు, అనుచరులు తప్పకుండా గొడుగు, టోపీలను విధిగా ధరించి ఎండనుంచి ఉపశమనం పొందాలి.
- ప్రచారం సమయంలో ఎక్కడైనా చెట్ల కింద లేదా భవనాల వద్ద సేదతీరాలి. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ప్రచారంలో దిగాలి. చెమట రూపంలో లవణాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. నీరు ఎక్కువగా తీసుకోవాలి. తమ వెంట నీళ్ల సీసాలు ఉంచుకోవాలి. ఓఆర్ఎల్, గ్లూకోజ్ వంటివి వెంట ఉంచుకోవాలి.
- మజ్జిగ తాగడం, కర్బూజ తీసుకోవడంతో ఉష్ణ తాపం నుంచి ఉపశ మనం లభిస్తుంది. అంబలి, పళ్ల తీసుకోవడం ద్వారా శరీరానికి శక్తిని, ఉత్సాహాన్నిస్తాయి.
- బయట శీతల పానీయాలు, ఎక్కడ పడితే అక్కడ నీళ్ల తాగవద్దు. చల్లదనంకోసం ఐస్‌క్రీములు తినవద్దు. మాంసం, వేపుడు కూరలు, నూనె పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. మాంసకృత్తులు తీసుకోవడం వల్ల శరీరాన్ని నిస్సత్తువను చేసి ప్రచారంలో అలసటను తెస్తుంది. సాధ్యమైనంత వరకు శాఖాహారం తీసుకోవాలి.
- మద్యం, ధూమపానం మానేయడం ఆరోగ్యానికి మంచిది. కాఫీలు, టీలు కూడా తాగకపోవడం ఉత్తమం.
- రాత్రివేళ ఆహారం తక్కువగా తేసుకుంటే ఉదయం ఉత్సాహంగా ఉంటారు.
- వేసవిలో కలుషిత నీరు, కలుషిత ఆహారంతో అతిసారం, కామెర్లు, టైఫాయిడ్, వడదెబ్బ తదితర జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.
- కాచిచల్లార్చిన నీటిని వడకట్టి తాగాలి. నీటిని శుభ్రపరచడానికి బిందెడు నీటిలో ఒక క్లోరిన్ బిళ్లను వేసి అరగంట తర్వాత తాగాలి.
- మల, మూత్ర విసర్జనల అనంతరం, భోజనానికి మందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- నిమ్మరసంలో ఉప్పు మిశ్రమాన్ని కలిపి తాగాలి.
- ఎండలో తిరగడం వల్ల తొందరగా అలిసిపోవడంతో పాటు విరో చనాలు అవుతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడ్ని సంప్రదించాలి.



నీటి ఉధృతికి కూలిపోయిన ఇనుప దోనె

● బెల్లుపటియా గ్రామానికి చెందిన ఈ రైతు పేరు శినగల పాపయ్య. దోనె ఆయకట్టులో సుమారు 30 సెంట్లు భూమి ఆయనకు ఉంది. గతంలో అన్నిపంటలు పండి తిండిగింజలు ఏడాదికి సరిపోయేవి. నేడు నీటికోసం ఏటా కష్టాలు తప్పడంలేదు. నీటి ఇంజిన్ల సాయంతో పంటలు వేస్తున్నారు. దీంతో సాగు కష్టంగా మారింది.



● బెల్లుపటియాలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన వంజరాపు అప్పన్నకు దోనె ఆయకట్టులో సుమారు 65 సెంట్లు భూమి ఉంది. గతంలో దోనె నుంచి పుష్కలంగా నీరందేది. పంటపై పూర్తిగా నమ్మకం ఉండేది. నేడు వర్షాధారంగా తయారై రెండేళ్లుగా పంటలు పండక ఒక్క గింజ కూడా ఇంటికి చేరడం లేదు.



# అమాత్యా.. అక్విడెక్ట్ గుర్తుందా?

- పునర్నిర్మాణానికి హామీ ఇచ్చిన సీదిరి
- నాలుగేళ్లయినా మరమ్మతులపై నిర్లక్ష్యం
- ఆయకట్టుకు అందని సాగునీరు
- రైతులకు తప్పని అవస్థలు

(హరిపురం)

మందస మండలంలోని బెల్లుపటియా గెడ్డపై రైతుల సౌకర్యార్థం నిర్మించిన ఇనుప దోనె(అక్విడెక్ట్) పునర్నిర్మాణానికి మంత్రి సీదిరి అప్పలరాజు ఇచ్చిన హామీని మరిచిపోయారు. బెల్లుపటియా సర్పంచ్ అగ్గున్న సూర్యారావు సొంతగ్రామం కావడంతో దోనె సమస్యను ఆయన మంత్రి దృష్టికి నాలుగేళ్ల కిందట తీసుకెళ్లారు. నిధులు మంజూరుచేసి దోనెను పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు.

## ప్రభుత్వం మారడంతో..

టీడీపీ హయాంలో ఎమ్మెల్యే శివాజీ రూ.91లక్షలు నిధులు మంజూరు చేయించి టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. ఆ ఏడాది ఖరీఫ్ పనులు ప్రారంభమవడంతో ప్రక్రియ ముందుకుసాగలేదు. నీరు పారేందుకు తాత్కాలికంగా ప్లాస్టిక్ గొట్టాలు అమర్చి ఆయకట్టులో ఐదు శాతం భూములకు నీరిచ్చి కొంతమేర ఇబ్బందులు తొలగించానికి చర్యలు తీసుకున్నారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఐదేళ్లుగా అలాగే మిగిలింది.

## రాజులకాలంలో నిర్మాణం

మందస మండలంలో డబార్సింగి, కళింగదల్, సునాముది వంటి నీటివనరుల తరువాత అంతే స్థాయితో సుమారు 1200 ఎకరాలకు అధికారికంగా, మరో 2250 ఎకరాలకు అనధికారికంగా బెల్లుపటియా గెడ్డపై నిర్మించిన అక్విడెక్టు నుంచి నీరందుతుంది. మహేంద్రతనయా నది నుంచి వచ్చే నీటిని మళ్లించడానికి చీపిగెడ్డపై అడ్డంగా రాజుపాలనలో నిర్మించిన ఇనుపదోనె(అక్విడెక్టు)వందల ఏళ్లపాటు రైతులకు ఎంతో సేవలందించింది. దీంతో మందస, సోంపేట మండలాల పరిధిలో సుమారు 12 గ్రామాలకు జీవధారగా మారింది. 20 ఏళ్ల కిందట కురిసిన భారీ వర్షాలతో వరద ఉధృతికి దోనె ఒకవైపు గట్టు కొట్టుకుపోయి కూలిపోయింది. దీంతో మహేంద్రతనయా నుంచి నీరు రాక ఈప్రాంత పొలాలన్నీ బీడు భూములుగా మారాయి.ఈ నేపథ్యంలో కనీస మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదు.

## తాత్కాలిక పనుల పేరుతో..

బీళ్లుగా మారుతున్న పొలాలను చూసి రైతులంతా కలిసి తలో కొంత వేసుకొని ప్లాస్టిక్ గొట్టాలు అమర్చి సాగుచేపట్టారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూ. 51 లక్షలతో దోనె పనులకు శంకుస్థాపన చేశారు. పదేహేనేళ్లు గడిచినా పనులు ఒక్క అడుగు కూడా ముందుకుసాగలేదు.గతంలో అదనంగా మరో రూ.3లక్షలతో ఇనుప దోనె ముందు భాగంతో సిమెంటు కాలువ నిర్మించారు. దీనికి అదనంగా మరో రూ.3లక్షలు నిధులు మంజూరు చేయించుకొని అధికార పార్టీ నాయకులు అండదండలతో కాంట్రాక్టర్లు తాత్కాలిక పనుల పేరుతో నిధులు దోచుకున్నారు. ఈ పనులు సైతం నాణ్యతా లోపంతో పట్టుమని పది నెలలు కూడా ఉండలేదు. కాలువ బీటలు దేరి నీరు రాని దుస్థితి నెలకొంది. దీంతో కథమళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతానికి వచ్చిన ప్రతి నాయకుడు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది.



బీటలు వారిన రిటైనింగ్ వాల్



దోనె స్థానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ప్లాస్టిక్ పైపులు

# హలో.. నన్ను గుర్తుపట్టారా?

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఓటరు దేవుళ్లకు నమస్కారం.. మీకోసం మళ్లీ వచ్చాను..నన్ను గర్తు పట్టారా? నేనేనండి..ఈవీఎంని.. అందరూ బాగున్నారా? మళ్లీ మీముందుకు వస్తున్నాను... నేను చెప్పేదేమిటంటే...నేను ఎలాఉపయోగపడతానో ఇప్పటికే అధికారులు చెప్పే ఉంటారు.. గతంలో నావల్ల ఏవో తప్పిదాలు జరిగాయని చాలామంది నన్ను తప్పుపట్టారు. అందుకే గతసారికి భిన్నంగా ఈసారి వచ్చాను. ఈసారి జాగ్రత్తగా నన్ను గమనించండి. మీరు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నారో అతని పేరును బాగా పరిశీలించండి. ఓ నిర్ణయానికి వచ్చాక మీరు ఓటు వేయండి. మీ ఓటును మీరే వేయండి... ఇతరులకు అవకాశమివ్వొద్దు. మీరు మీట నొక్కినపుడు కీ అనే శబ్దం వస్తుంది. అలా శబ్దం వస్తేనే మీరు ఓటు వేసినట్లు. సరేనా... ఉండనా మరి.. బాగా గుర్తుంచుకోండి... ఎన్నికల ముందురోజు డబ్బు ఇచ్చాడనో... మందు ఇచ్చాడనో... ఎవరో చెప్పారనో విలువైన ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు... గడచిన అయిదేళ్లు అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిని.. ఎవరెలా పోతే నాకేంటని ధీమాగా అధికారాన్ని అనుభవించిన వారిని... నియోజకవర్గ అభివృద్ధికి కనీసం కృషి చేయని వారిని.. కొత్తగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న వారిని దూరంగా ఉంచండి. అధికారం ఉన్నా లేకపోయినా మీ కష్టసుఖాల్లో పాలు పంచుకున్న వారికి.. మీ నియోజకవర్గం ఎవరు అభివృద్ధి చేస్తారని మీరు నమ్ముతారో.. వారికే ఓటువేసి అసెంబ్లీకి పంపండి...ఉంటాను మరి.



ఇట్లు

- మీ ఈవీఎం

# ఫొటోలన్నీ సామాజిక మాధ్యమాల్లో పెట్టొద్దు





(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ ఫోన్లు వచ్చిన తరువాత ప్రతిదీ ఫొటో తీసేస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో పెట్టేస్తున్నాం. ఇప్పుడీ సార్వత్రిక ఎన్నికల సమయంలో మాత్రం తీసిన ప్రతి ఫోటో సామాజిక మాధ్యమాల్లో పెట్టడం చట్ట విరుద్ధం. దీన్ని అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా ఫోటోలు పెడితే ఎన్నికల సంఘం తీసుకోనే చర్యలకు సిద్ధం కావాల్సిందే. ఓటు వేసే సమయంలో తెలిసో తెలియకో సెల్ఫీ తీసుకుంటే ఎన్నికల నియమావళి 49ఎం (ఓటు రహస్యం) ప్రకారం నేరం. చట్టప్రకారం ఆ ఓటరును బయటకు పంపించేస్తారు. ఆ ఓటును 17ఏలో నమోదు చేస్తారు. ఓట్లు లెక్కించేటప్పుడు పరిగణనలోకి తీసుకోరు.



# ఎక్కడ ఉన్నారో.. ఎలా రప్పించాలో..

- ఓటరు జాబితాల్లో పేర్లున్నా.. జాడ లేని వైనం
- వలస ఓటర్ల ఆచూకీ కోసం నేతల అగచాట్లు
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

(నరసన్నపేట)

జిల్లాలో ఎన్నికల నామినేషన్ ఘట్టం ముగిసింది. పోటీలో ఉండేవారి వివరాలను రిటర్నింగ్ అధికారులు ప్రకటించడంతో అసలైన ఘట్టం ప్రారంభమయ్యింది. నిన్నమొన్నటి వరకూ బీ-ఫారాలు, టికెట్లకోసం పార్టీ అధిష్ఠానాల చుట్టూ తిరగడంతో ప్రచారం, ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించలేకపోయారు. పోటీ రసవత్తరంగా మారుతుండడంతో అభ్య ర్థులు, వారి అనుచరులు గెలుపునకు ఉండే అన్నిమార్గాలూ అన్వేషిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా మెజార్టీ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ఈనేపథ్యంలో గ్రామాల్లో వలస ఓటర్లపై అభ్యర్థులు దృష్టి సారించారు. గతంలో స్థానికసంస్థల ఎన్నికల సమయంలో మాత్రమే వలస ఓటర్లను స్వస్థలాలకు రప్పించి ఓట్లు వేయించేవారు. ప్రస్తుతం పోటీలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థులు వలస ఓటర్లను ఎలాగైనా తెప్పించి ఓటు వినియోగిం చేకునేలా చర్యలు ప్రారంభించారు.

## అభ్యర్థుల అగచాట్లు

ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నా, స్థానికంగా వారు కనిపించకపోవడంతో ఎక్కడ ఉంటారో, ఎలా వారిని పోలింగ్‌బూత్‌కు రప్పించాలోనని ఆందోళన చెందుతున్నారు. వారి ఆచూకీ కోసం ప్రధానరాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు అగచాట్లు పడుతున్నారు. ఆయా పార్టీల్లోని వార్డు ఇన్‌చార్జిలు, బూత్‌కన్వీనర్లు, బూత్ ఏజెంట్ల ద్వారా శ్రీకాకుళం, నరసన్న పేట, టెక్కలి, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఆమదాలవలస, సొంపేట తదితర పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. జాబి తాలో ఉన్న ఓటర్లు స్థానికంగా ఎంతమంది ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఉన్నా రు. వారిని ఎలారప్పించాలి.. తదితర అంశాలపై దృష్టిపెట్టారు. పట్టణాల్లో ఒక్కో వార్డులో 50 నుంచి 100 మంది వరకు వలస ఓటర్లు ఉండగా, పల్లెల్లో వర్షాభావం వల్ల ఈ ఏడాది వేల సంఖ్యలో వలసవెళ్లారు. గతంలో బీఎల్వోలు ఇంటింటా తిరిగి ఎక్కడ నివాసం ఉం టున్నారో అక్కడ వారి ఓట్లను చేర్చాలని అధికారులు కోరినా కొందరు పట్టణాల్లో అమలు చేయలేదు. ప్రస్తుతం అటువంటి ఓటర్లకు బీఎల్వోలు స్లిప్‌లు ఎలా ఇస్తారో అంతుపట్టడం లేదు. ఈనేపథ్యంలో వలస ఓటర్ల స్థానంలో పట్టణ ప్రాంతాల్లో దొంగ ఓట్లు పడే అవకా శాలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి వలస వెళ్లినవారి ముఖాలు పోలింగ్ ఏజెంట్లకు తెలియకపోవడం, పట్టణ ప్రాంతాల్లో పరిచయాలు పెద్ద లేకపోవడం తదితర కారణాల వల్ల ఒకరి ఓటు మరొకరు వేసే అవకాశం ఉంటుంది.

## రప్పించేందుకు ప్రయత్నాలు

ఇతర రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్న వలస ఓటర్ల రప్పించేందుకు గ్రామాల్లో రాజకీయ నాయకులు ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలెట్టారు. ఇందుకోసం మండలంలోని గ్రామాల నేతలను పార్టీ కార్యాలయాలకు రప్పించి తాజా ఓటర్ల జాబితాల్లో ఉన్న వలస ఓటర్లను గుర్తిస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరులో ఉన్న వలస ఓటర్లను రప్పించేందుకు జాబితాను సిద్ధం చేస్తున్నారు. వారికి వీలైతే బస్సులు ఏర్పాటు చేయడం కానీ, లేదా ఫోన్లు చేసి ఫోన్‌పే ద్వారా రాను పోను ఖర్చులకు డబ్బులు పంపించి రప్పించేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు.



## మత్స్యకారులే కీలకం

జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజక వర్గాల్లో తీరానికి ఆనుకుని ఉన్న మండలాల్లో 122 గ్రామాలు ఉన్నాయి. సుమారు తీరంలో 40 వేల కుటుంబాలు చేపలవేటపైనే ఆధారపడుతున్నారు. ప్రధా నంగా జిల్లాలో జట్టీలు, ఫిషింగ్ హార్బర్లు, కోల్డ్‌స్టోరేజ్‌లు లేకపోవడంతో సుమారు పదివేల మంది మత్స్యకారులు గుజరాత్‌లోని వీరావల్ తదితర ప్రాంతాలకు వేటకోసం వలస వెళ్లాల్సివస్తోంది. ప్రతిసారి జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో వీరు కీలకంగా మారుతున్నారు. ఎక్కువగా పలాస, శ్రీకా కుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో గెలుపోటములపై వలస మత్స్యకారులు ప్రభావం చూప నునాన్నరని మత్స్యకార సంఘ నాయకులు చెబుతున్నారు. ప్రధానంగా పలాస నియో జకవర్గం పరిధిలో వజ్రపుకొత్తూరులో 84 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 20 వేల మంది వరకూ దేశంలో వివిధ ప్రాంతాలకు వేట, ఉపాధికోసం వలస వెళ్లారు. ఈ నియోజకవర్గంలో ఓ సారి ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా కూడా గెలు పొందారు. ప్రతి ఎన్నికల్లో ఇక్కడ మత్స్యకారులే విజేతను నిర్ణయిస్తారు. శ్రీకాకుళం రూరల్, గార మండలాలో ఎనిమిది గ్రామాలు, ఎచ్చెర్ల, రణస్థలం మండలంలోని 12 పంచాయతీల్లో వందలాది మంది వలస మత్స్యకారులు ఉన్నారు.

## ఖర్చుకు వెనుకాడని వైనం

శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రధాన పార్టీల నుంచి తొలిసారి చట్టసభల్లోకి వెళ్లాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరంతా వ్యయానికి సైతం వెనకడుగు వేయడంలేదు. దీంతో తక్కువ సమయం ఉన్నా తమకు ఖచ్చితంగా తమకు పడతాయని భావించి వలస ఓటర్లను రప్పించే ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రధానంగా నరసన్నపేట నియోజకవర్గంలోని 290 పోలింగ్‌కేంద్రాల పరిధిలో ఏడు వేల మంది వలస ఓటర్లు ఉంటారని రాజకీయపార్టీల నాయకులు అంచనావేస్తున్నారు. పాతప ట్నం నియోజకవర్గం పరిధిలో ఐదు మం డలాల్లో వర్షాభావం వల్ల వ్యవసాయ కాలం తర్వాత వేలాది మంది చెన్నై, ముంబై తదితర ప్రాంతాలకు ఉపాధికోసం వలస వెళ్తుం టారు. ప్రతిఎన్నికల్లో నాలుగు వేలమంది వరకూ ఓట్లుహక్కు వినియోగించుకోవడానికి వస్తుంటారని అంచనా. ప్రధానంగా ఉద్దానం ప్రాంతంలోని ఇచ్ఛాపురం, పలాస నియోజ కవర్గాలు వర్షాధారంపైనే ఆధారపడతాయి. ఇక్కడ నుంచి దేశంలో వివిధ ప్రాంతలతోపాటు సౌదీఅరేబియా తదితర ప్రాంతాల్లోఉపాధికోసం 15 వేల మంది వరకు వలస వెళ్లి ఉంటారని ఉద్దానంలోని యువజన సంఘ నాయకులు చెబుతున్నారు.ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వలస ఓట్లకు పాధాన్యం ఏర్పడింది.





# భూసమస్యను పరిష్కరించడం లేదని..

- ఎన్నికల బరిలో నిలిచిన దంపతులు
- ఎంపీ అభ్యర్థిగా భర్త.. ఎమ్మెల్యే అభ్యర్థిగా భార్య పోటీ



చేపలు అమ్ముతున్న దుర్గారావు, కామేశ్వరి

**నరసన్నపేట:** పోలాకి మండలం యాట్ల బసివలసలోని దళిత కుటుంబానికి చెందిన కాయి దుర్గారావు, కామేశ్వరి దంపతులు ఎన్నికల బరిలో దిగారు. వీరిద్దరూ చేపలు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా దుర్గారావు, నరసన్నపేట అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కామేశ్వరి జాతీయ నవరంగ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. తమ గ్రామంలోని డిపట్టా భూములు సమస్యలను ఏ పార్టీ నాయకులు పరిష్కరించడం లేదని, ఏ ఒక్కరూ ఈ సమస్యపై స్పందించకపోవడంతో ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు దంపతులు తెలిపారు. ప్రస్తుతం చేపల వ్యాపారానికి తాత్కాలికంగా విరామం ఇచ్చి ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

# రెండు ఈవీఎంలలో సమాన అభ్యర్థులే..

- ఆమదాలవలస నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి

**ఆమదాలవలస:** జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా ఆమదాలవలస నియోజకవర్గంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల సమాన సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ లోక్‌సభ అభ్యర్థులుగా 13 మంది, అసెంబ్లీ అభ్యర్థులు 13 మంది బరిలో నిలిచారు. ఆమదాలవలస తప్ప మిగతా నియోజకవర్గాల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసం ఉంది. దీంతో అక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్యను బట్టి ఈవీఎంలు ఉంటాయి. కానీ, ఆమదాలవలస నియోజకవర్గంలో చెరు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య సమానంగా ఉండడంతో కొంత విచిత్రం పరి స్థితి ఏర్పడింది. ఈ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న రెండు ఈవీఎంలలో కూడా 13 మంది ఎంపీ అభ్యర్థులు, 13 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ఉండనున్నాయి. మిగిలిన నియోజక వర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్న వివిధ పార్టీల అభ్య ర్థులు తక్కువ గుర్తులున్న ఈవీఎం ఎమ్మెల్యేకు సంబం ధించినదని, ఎక్కువ గుర్తులున్న ఈవీఎం ఎంపీకి సం బంధించినదని ప్రచారం చేయాల్సి వస్తోంది. ఆమదాల వలస నియోజకవర్గంలో రెండు ఈవీఎంలలో 13 సంఖ్యలే ఉండడంతో వేరేగా ప్రచారం చేయాల్సిన బాధ తప్పింది.

## ఉమ్మడి మేనిఫెస్టోతో అభివృద్ధి, సంక్షేమం: బగ్గు



మదనాపురంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బగ్గు రమణమూర్తి

**జలుమూరు, (సారవకోట):** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలో రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం ఇమిడి ఉందని నరసన్నపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. మదనాపురం, చంద్రయ్యపేట, జాలారి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గడచిన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి చరమగీతం పాడలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతీ ఒక్కరు సైకిలు గుర్తుపై ఓటువేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, పలువురు నేతలు పాల్గొన్నారు. ● **నరసన్నపేట:** టీడీపీ హయాంలోనే నరసన్నపేట పట్టణం అభివృద్ధి జరిగిందని ఉమ్మడి పార్టీల అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక బండివీధిలో వైసీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు ముద్దాడ బాలభూపాల నాయుడు, రఘుపతి నాయుడు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రమణమూర్తి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు శిమ్మ చంద్ర శేఖర్, నేతలు కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్‌ను వైసీపీ నాశనం చేసింది: శంకర్

**అరసవల్లి:** రాష్ట్రంలో యువత భవిష్యత్‌ను గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని, వారి శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసిందని శ్రీకాకుళం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం ఆధ్వర్యంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ నేతృత్వంలో యువతతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, మెగా డీఎస్సీపైనే సీఎంగా చంద్రబాబు తొలి సంతకం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయుడును ఎంపీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో పెద్ద ఎత్తున యువత, అభిమానులు పాల్గొన్నారు. ● ఒక్క అని ప్రజలు అవకాశం ఇస్తే జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాడని, మరో ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తాడని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని 19వ డివిజన్ కెల్ల వీధిలో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేసిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో అమలు ద్వారా రాష్ట్రంలో మరలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతాయన్నారు. అనంతరం డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, మాజీ కౌన్సిలర్ కెల్ల కొండలరావు, నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కెల్ల రాజేష్, కిషోర్‌కుమార్ , పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న గొండు శంకర్

## టీడీపీతోనే పేదల అభివృద్ధి: గోవిందరావు



పట్టుపురంలో ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు

**మెళియాపుట్టి:** టీడీపీ ప్రభుత్వంతోనే పేదల అభివృద్ధి జరుగుతుందని పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం జోడూరు, మారుడుకోట, పట్టుపురం, కోసమాళ పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మోహనరావు, అనపాన రాజశేఖరెడ్డి, వెంకట్రావ్, బోచ్చుప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● **కొత్తూరు:** రానున్నది కూటమి ప్రభుత్వమేనని పాతపట్నం అసెంబ్లీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. బలద గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బోడసింగి వెంకట రమణమూర్తి, నేతలను బలగ లింగంనాయుడు, పెనుగోటి ఆనందరావు, బైరాగి, కంచరాం పురుషోత్తం, బెహరా గోవిందరావు తదితరులను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం కౌసల్యాపురం సర్పంచ్ ప్రతినిధి గనేన గోవిందరావు, ఇతర నాయకులను ఎంజీఆర్ కలిశారు. ● **ఎల్.ఎన్.పేట:** మండలంలోని బొర్రంపేట నుంచి కొత్తూరు వరకు గురువారం నిర్వహించనున్న బైక్ ర్యాలీలో పార్టీ క్యాడర్ పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు వి.గోవిం దరావు, కె.కృష్ణమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయు డు, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవింద రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి పాల్గొంటారన్నారు. ఉదయం 8 గంటలకు బొర్రంపేట గ్రామానికి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## కూటమిని ఆదరించండి: కూన రవికుమార్



పొందూరు: ప్రచారంలో మాట్లాడుతున్న రవికుమార్

**పొందూరు:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని ఆదరించడం ద్వారా ఆ పార్టీల అభ్యర్థులను గెలిపించాలని ఆమదాలవలస కూటమి అభ్యర్థి కూన రవి కుమార్ కోరారు. బుధవారం తుంగపేట, గోరింట, గోకర్ణపల్లి, తాడివలస, లొద్దలపేట, గంగ్రేడు, బొడ్డేపల్లి, మొదలవలస, సింగూరు, కింతలి, కనిమెట్ట, ఆముదాలవలస మండలం లొద్దలపేట, నెలిపర్తి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పి.రామ్మోహన్, బీజేపీ ఇన్‌చార్జి పి.సూరపునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కె. సత్యనారాయణ, చింతాడ వాసు, పి.వేణు, సీపాన శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలోకి మాజీ సర్పంచ్..

**ఆమదాలవలస:** నియోజకవర్గంలోని బూర్జ మండలం అల్లెన గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గేదెల బాల చంద్రమౌళీశ్వరరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి కూన రవికుమార్ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాల చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ... ఐదేళ్లలో వైసీపీ హయాంలో బూర్జ మండలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. గతంలో కూన రవి కుమార్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందువల్ల రవికుమార్ నాయకత్వం నియోజకవర్గానికి అవసరమని గుర్తించి టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి సీతారాంబాబు, నేతలు రాంజీ, లచ్చయ్యపేట మాజీ సర్పంచ్ గిరిడ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీ, బీజేపీలోకి చేరిక

**రణస్థలం:** కృష్ణాపురానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీ, బీజేపీల్లో చేరాయి. గ్రామానికి చెందిన గొర్లె అప్పలనాయుడు, నడుపూరి రామారావు, ఎన్.రామప్పుడు, ఎన్.చిన్న, ఎన్.అప్పలనాయుడు, గొర్లె కూర్మినాయుడు, గొర్లె రామి నాయుడుతో పాటు మరో 15 కుంటుంబాలు వైసీపీని వీడి ముల్లు కృష్ణ, ఎన్.శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీల్లో చేరగా వీరికి కూటమి ఎచ్చెర్ల అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే గొర్లెపేటకు చెందిన మాజీ జడ్పీటీసీ మహంతి సత్యంనాయుడు, ఎం.ప్రసాద్, ఎం.కృష్ణంనాయుడుతో పాటు మరికొన్ని కుటుంబాలు టీడీపీలో చేరారు. అనంతరం కృష్ణాపురం, గొర్లెపేట, మహంతిపాలెంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి తాగునీరు సదుపాయం కల్పిస్తానని, ఆడబిడ్డలకు కష్టం లేకుండా ఇంటి వద్దే కొళాయిలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు లంక ప్రభ, డీజీఎం ఆనందరావు, గొర్లె లక్ష్మణరావు, పిషిని జగన్నాథంనాయుడు, లంక కృష్ణ, ముక్కు ఆదినారాయణ, గొర్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

● **రణస్థలం:** ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలో టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కూటమి నేతలు క్షీరాభిషేకం నిర్వహించారు. కూటమి అభ్యర్థులు నడుకుదిటి ఈశ్వరరావు, కలిశెట్టి అప్పలనాయుడులను గెలిపించాలని బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బెండు మల్లేశ్వరరావు, వావిలిపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, అన్నెపు భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌డీఏ కూటమిలో చేరిన వైసీపీ నాయకులతో బీజేపీ అభ్యర్థి ఎన్ఈఆర్

## వైసీపీ నేతల ఆగడాలతో ప్రజలకు ఇబ్బందులు: ఎంపీ

**కాశీబుగ్గ:** ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పలాస పట్టణంలో వైసీపీ నేతల ఆగడాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీ కింజరాపు రామ్మో హన్ నాయుడు అన్నారు. మేడే సంద ర్భంగా మంకినమ్మ ఆలయం వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి గౌతు శిరీషతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలాస కాశీబుగ్గ పట్టణాల్లో ఉన్న 14 కార్మిక సంఘాలు టీడీపీలో చేరాయి. వీరికి ఎంపీ రామ్మోహన్, శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బందిపోటు జగన్ పాలన చేస్తున్నారని, ఆయనను ఎదుర్కొని కూటమిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగు నీరు సరఫరా చేయలేని పరిస్థితుల్లో మంత్రి ఉన్నా రని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీరు అందిస్తామన్నారు. రానున్న ఎన్ని కల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, నాగరాజు, సూర్య నారాయణ, గాలి కృష్ణారావు, గంగా భవానీ, దానేటి పద్మజీ తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష

### మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు: అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

**కవిటి:** ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించడం ద్వారా మేలు చేకూరు తుందని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. బొర్రపుట్టుగ, తొత్తిడిపుట్టుగ గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. చింతామణి ఎలక్ట్రికల్ యూనియన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అవసరాన్ని వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. నేతలు బి.రమేష్, ఎ.రాజు, వి.రంగారావు, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. బుధ వారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అధ్యక్షతన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ.. మే 13న జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తామంతా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమం లో టీడీపీ ఇన్‌చార్జి రామారావు, తిప్పన దుర్యోధనరెడ్డి, లోల్ల రాజేష్ పాల్గొన్నారు.

### ఎచ్చెర్ల పరిశీలకుడిగా జడ్పీటీసీ బుచ్చిబాబు

**హిరమండలం:** హిరమండలం జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబును ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా నియమిస్తూ మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులొచ్చాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావుకు మద్దతుగా ప్రచారం చేస్తూ, విజయావకాశాలపై ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశించినట్లు బుచ్చిబాబు తెలిపారు. బుధవారం ఎన్ఈఆర్‌తో బుచ్చిబాబు సమావేశమయ్యారు.

### మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**పొందూరు:** చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్ఈబీ ఏఎస్పీ డి.గంగాధరం ఆదేశించారు. బుధవారం ఉల్లివలస చెక్‌పోస్టు, పొందూరు ఎస్ఈబీ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఇతలపాక రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## అన్ని వర్గాలకు మేనిఫెస్టో ఆమోదయోగ్యం : అచ్చెన్న




సంతబొమ్మాళి: టీడీపీలో చేరిన ముస్లిం నేతలతో అచ్చెన్నాయుడు

**టెక్కలి:** ఎన్డీఏ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఆమోద యోగ్యంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు మేనిఫెస్టోను ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటానికి బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్‌తో కలిసి పరశురాంపురంలో పాలభిషేకం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్ రెడ్డికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్ర మంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, నేతలు మట్ట సుందరమ్మ, పంగ తవిటయ్య, పంగ వసంత్, శ్యామ్, మక్క శంకరరెడ్డి తదితరులు పాల్గొ న్నారు. ● టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులను ఆదు కుంటామని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో భావనపాడు, గెద్దలపాడు, ఉమిలాడ, మరువాడ, లక్కివలస, సున్నాపల్లి, పాతమేఘవరం, శ్రీజగన్నాథపురం తదితర గ్రామాల నుంచి మత్స్యకారులు వచ్చి వారి సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పుక్కళ్ల శ్రీనివాస్, దానేసు, ధనరాజ్, చంటి, రాజులు పాల్గొన్నారు. ● **టెక్కలి/సంతబొమ్మాళి:** నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కోటబొమ్మాళి మండలం కురుడు నుంచి 20 కుటుంబాలు, రామయ్యపేట నుంచి పది, నందిగాం మండలం బడగాం నుంచి పది, సంతబొమ్మాళి మండలం శ్రీకృష్ణాపురం నుంచి 25, బోరుభద్ర నుంచి 20, నూరాడ వానిపేట నుంచి 20, గొదలాం నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

### సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

**అరసవల్లి:** కార్మిక సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి కోరారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక పతాకాన్ని ఎగురవేశారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా మార్పు చేసి కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఎం.ప్రభాకర్, ఎన్.గోపి, పొందూరు చంద్రరావు, ఆర్.ప్రకాష్, వెంకట్రావు పాణిగ్రాహి, లక్ష్మి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఐక్య పోరాటంతోనే హక్కుల పరిరక్షణ



కేంద్రప్రభుత్వం పలు కార్మిక చట్టాలను సవరించడం ద్వారా వారి హక్కులకు పెను ప్రమాదం ఏర్పడిందని, ఐక్య పోరాటాలతో వాటిని రక్షించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మేడే సందర్భంగా బుధవారం ఉదయం మునిసిపల్ కార్యాలయం, సివిల్ సప్లయి గొడౌన్స్, మార్కెట్ యార్డ్, రామలక్ష్మణ జంక్షన్, చిత్తరంజన్ వీధిలో ఎర్ర జెండా లను ఎగురవేశారు. రామలక్ష్మణ కూడలి నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు, నాయకులు టి.తిరుపతిరావు, చిక్కాల గోవిందరావు, కల్యాణి అప్పలరాజు, పార్థసారధి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను నిర్వహించారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**ఎల్.ఎన్.పేట:** మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.గిరిబాల ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### సుభలయలో ముగిసిన నీలమణి ఉత్సవాలు

**హిరమండలం:** సుభలయలో పది రోజులుగా నిర్వహిస్తున్న నీలమణి అమ్మవారి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. మంగళవారం రాత్రి గ్రామంలోని పూతి సీతమ్మ ఇంట్లో పూజలు అందుకున్న అమ్మవార్ని దేవర బుట్టలో కొలువుదీర్చి ఘటాలతో ఊరేగించారు.

### ముగిసిన పీవో, ఏపీవోలకు శిక్షణ

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణపై రెండురోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్వో సుదర్శన్ దొర ఎన్నికల సామగ్రి సేకరణ, ఏజెంట్లకు మాక్ పోలింగ్, సీలింగ్ విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### నేడు ఆదిత్యుని హుండీల లెక్కింపు

**అరసవల్లి:** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్వీ ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

### జగన్నాథ మందిరానికి రూ.3 లక్షల విరాళం

**పర్లాకిమిడి:** పట్టణంలోని జగన్నాథ మందిరం నిర్మాణానికి ప్రముఖ వైద్యులు రామచంద్ర రవి రూ.3 లక్షల చెక్కును బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ను కమిటీ సభ్యులు అభినందించారు.

## కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి

**టెక్కలి:** కార్మికుల కోసం రూపొందించబడిన చట్టాలపై ప్రతి కార్మికుడు అవగాహన కలిగి ఉండాలని టెక్కలి కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి మల్లా తేజా చక్రవర్తి అన్నారు. బుధవారం టెక్కలిలో ఓ కల్యాణమండపంలో కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని కార్డు కలిగి ఉండాలన్నారు. అలాగే బీమా సదుపాయం పొందాలన్నారు. వివిధ కార్మిక చట్టాలపై అవగాహన కలిగించారు. బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్మికశాఖ అధికారి రాధా కుమారి, ఎస్ఐ లక్ష్మి, న్యాయవాది సాయిరాజు, సీఐటీయూ నాయకుడు షణ్ముఖరావు పాల్గొన్నారు.

### నియంత పాలనకు చరమగీతం పాడాలి

**నరసన్నపేట:** రాష్ట్రాన్ని తాకట్టుపెట్టిన నియంత పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్‌తోనే దేశంలోను, రాష్ట్రంలోనూ అభివృద్ధి జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు, ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు, నరసన్నపేట అసెంబ్లీ అభ్యర్థి మంత్రి నర్సింహమూర్తి అన్నారు. బుధ వారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మామిడి సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎంల భద్రతపై దృష్టి సారించాలి

**రణస్థలం:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి కోరారు. బుధవారం చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్‌తో కలిసి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు సిద్ధం చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల ప్రవేశం, నిష్క్రమణ, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, అగ్ని మాపక యంత్రాల తదితర భద్రత ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు.

### పెన్షన్ల పంపిణీ

**శ్రీకాకుళం క్రైం:** సామాజిక పెన్షన్‌లను బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా స్వయంగా పంపిణీ చేశారు. వాంబే కాలనీ, బాదుర్లపేట, పాత్రుని వలస ప్రాంతాల్లో ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ పెన్షన్లపై ఆరా తీశారు.

### గుండె పోటుతో టీడీపీ నాయకుడి మృతి

**రణస్థలం:** వేల్పురాయికి చెందిన టీడీపీ నాయకుడు కలిశెట్టి లక్ష్మణ (48) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని పలువురు నాయకులు కొనియాడారు. లక్ష్మణ మృతి తీరనిలోటని ఎన్‌డీఏ కూటమి బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

**ఆమదాలవలస:** ఆమదాలవలస రైల్వే పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి రైలు ఢీకొని ఈ ఘటన జరిగిందని, మృతుడికి సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, గోధుమ కలర్ షార్ట్, తెల్లపంచె ధరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

### పాముకాటుతో..

**పలాసరూరల్:** సున్నాడ గ్రామానికి చెందిన కుమ్మరి పద్మనాభం (50) బుధవారం సాయంత్రం పాముకాటుతో మృతి చెందాడు. సాయంత్రం పొలాల వైపు బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### నేడు జిల్లాలో వడగాల్పులు

**కలెక్టరేట్:** జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వడగాల్పులుంటాయని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. బూర్జ, హిరమండలం, లక్ష్మీనర్సుపేట, పాత పట్నం, సరుబుజ్జిలి మండలాల్లో తీవ్ర వడగాల్పులు, ఆమదాలవలస, జి.సిగడాం, జలుమూరు, కొత్తూరు, ఇచ్ఛాపురం, పొందూరు, కంచిలి, కవిటి, సోంపేట, కోటబొమ్మాళి, మందస, నందిగాం, నరసన్నపేట, పలాస, టెక్కలి మండలాల్లో వడగాల్పులు వీచే అవ కాశం ఉందన్నారు. ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 గంటల నుంచి సాయం త్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532







